క్లుప్తంగా

26న షిర్డీ సాయి నాలుగో వార్షికోత్సవం

మామిడికుదురు: పెదపట్నంలంకలో **కొలువుదీ**రిన షిర్డీ సాయిబాబా చతుర్ధ వార్షికో**త్సవం ఈ** నెల 26వ తేదీ గురువారం జరు**గుతుందని** ఆలయ కమిటీ బుధవారం తెలిపింది. **దీనిలో** భాగంగా 25వ తేదీ బుధవారం ఉద**యం కాకడ** హారతి, అభిషేకాలు, మంగళస్నానం ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 గంటలకు శ్రీషిర్డీ సాయి అమృత వర్షిణి సత్సంగం, మండపేట వారితో భజన, పుష్పాభిషేకం జరుగుతుందన్నారు. అనంతరం మహానైవేద్యం, మధ్యాహ్న హారతి ఏర్పాటు చేశామన్నారు. 26వ తేదీ కాకడ హారతి, షిర్డీ సాయిబాబా సమాధి మందిరం నుంచి తీసుకువచ్చే బాబా ప్రతిమలను ఊరేగిస్తామన్నారు. వార్షికోత్సవ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కమిటీ సూచించింది.

పదివేల మాస్క్‌ల పంపిణీ

అంబాజీపేట: పుల్లేటికుర్రు రూరల్ డెవలప్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జగ్గన్నతోట తీర్థానికి వచ్చిన భక్తులకు 10వేల మాస్క్‌లను ఎస్సై ఎ.చైతన్యకుమార్ ద్వారా పంపిణీ చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ సురేష్, కార్యదర్శి త్రిమూర్తులు, ట్రెజరర్ ప్రసన్న మంగళవారం తెలిపారు. రానున్న కాలంలో టస్ట్ ద్వారా నిరుపేదలకు సాయం అందించేలా ప్రణాళిక చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించాలి

అంబాజీపేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడంతో పాటు ప్రజలకు వివరించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట, మాచవరం, నందంపూడి, వాకలగరువు, తొండవరం గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీపీ వెంకటేశ్వరరావుతో పాటు ఎంపీడీఓ ఐ. రత్నంరాజు మంగళవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ సచివాలయాలకు వచ్చేవారి వివరాలను సేకరించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయవలసిన దరఖాస్తులను సకాలంలో పూర్తి చేసేలా చూసుకోవాలన్నారు. సర్పంచ్ మద్దింశెట్టి దొరబాబు వారి వెంట ఉన్నారు.

ప్రజా సమస్యలపై పోరుబాట

సఖినేటిపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ పోరుబాట పట్టనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లుబోయిన తాతారావు అన్నారు. మంగళవారం అంతర్వేదికరలో పార్టీ సీనియర్ నాయకుడు చెల్లుబోయిన కేశవశెట్టి ఇంటి వద్ద పోరుబాటలో భాగంగా ఫిబ్రవరి 22న విజయవాడలో నిర్వహించనున మహాధర్నా వాల్‌పోస్టర్‌ను తాతారావు ఆవిష్కరించారు.

రికార్డుల తనిఖీ

ఆలమూరు: మండలంలోని జొన్నాడ గ్రామ పంచాయతీ కార్యాలయం పరిధిలో వైద్యారోగ్యశాఖ రికార్డుల తనిఖీ జరిగింది. పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.సుదర్శన్‌బాబు ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు పీవీ రమణారావు. పి.ఉమ స్థానిక 1,2 సచివాలయాలను సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి మందుల నిల్వలను పరిశీలించారు. బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకుని సూచనలు, సలహాలు అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.నాగమణి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

అంబాజీపేట: నిరుపేదలకు చేయూతనిచ్చే దాతల సహకారం మరువలేనిదని సర్పంచ్ వాసంశెట్టి రేవతి, వైఎస్సార్ సీపీ నాయకుడు వాసంశెట్టి పెదబాబు అన్నారు. వక్కలంకలో భగవాన్ సత్యసాయి సేవా సమితి పర్యవేక్షణలో సత్య సాయిబాబా జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బచ్చు నాగేశ్వరరావు (నాగం మాస్టారు) ఆధ్వర్యంలో 100 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేసి, భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బి.అక్కారావు, గెల్లి గోపాలకృష్ణ, సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మమ్మ తీర్థం

మలికిపురం: మండలంలోని మేడిచర్లపాలెంలో కొలువైన మహాలక్ష్మమ్మ అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గరగ నృత్యాలు, బ్యాండు వాయిద్యాలు, బాణసంచా కాల్పులు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు అరటిపళ్లు, కొబ్బరికాయలు నైవేద్యంగా సమర్పించారు.

దాడి ఘటనపై కేసు

పి.గన్నవరం: నాగుల్లంక శివారు పెదకందాలపాలెంలో భార్యాభర్తలపై దాడికి పాల్పడిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై పి.గంగాభవాని తెలిపారు. ఇటీవల పెదకందాలపాలెం ర్యాంపు నుంచి వెళ్తున్న మట్టి లారీ రోడ్డు పక్కన ఉన్న ఫ్లెక్సీని పెద్ద శబ్దంతో ఢీకొట్టిందని, దీంతో ఆందోళన చెందిన సమీప ఇంటి యజమాని యు.రాజేష్ ఆ లారీని అడ్డుకున్నాడని ఎస్సై వివరించారు. ఈనేపథ్యంలో లారీని ఎందుకు అడ్డుకున్నావంటూ అదే గ్రామానికి చెందిన సీహెచ్ ప్రసాద్ తనను, తన భార్యను కొట్టాడని రాజేష్ ఫిర్యాదు చేశారన్నారు. అతడి ఫిర్యాదు మేరకు ప్రసాద్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.


కాలువలో వ్యక్తి గల్లంతు

పి.గన్నవరం: నాగుల్లంక గ్రామం వద్ద ప్రధాన పంట కాలువలో పడి ఓవ్యక్తి గల్లంతయ్యాడు. గ్రామానికి చెందిన డి.రాంబాబు (35) మంగళవారం ప్రమాదవశాత్తూ పంట కాలువలో పడి గల్లంతయ్యాడని వీఆర్వో కేవీవీ సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రాంబాబు కోసం పంట కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు.

పొంచి ఉన్న ప్రమాదం



మెండుపాలెం వద్ద డ్రెయిన్‌పై శిథిల కల్వర్టు



దెబ్బతిన్న కల్వర్టు గడ్డర్లు, శ్లాబ్

- శిథిల కల్వర్టుతో ప్రజల్లో భయం
- గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం
- తాజాగా రూ.కోటి 50 లక్షలతో ప్రతిపాదనలు

సఖినేటిపల్లి: రాజోలు నియోజకవర్గంలో సముద్ర తీరం వెంబడి అంతర్వేది నుంచి కరవాక వరకూ ఉన్న గ్రామాలకు ఎంతో ఉపయోగకరంగా కేశవదాసుపాలెం శివారు మెండుపాలెం వద్ద శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌పై పూర్వం నిర్మించిన కల్వర్టు పూర్తి శిథిల స్థితికి చేరుకుంది. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన కల్వర్టు నేడో రేపో కూలిపోవడానికి సిద్ధం ఉందని స్థానికులు తెలిపారు. ఇటీవల కాలంలో కల్వర్టు తాలూకు సపోర్టు దిమ్మలు దెబ్బతినడం, కల్వర్టు శ్లాబ్‌కు పెద్ద రంధ్రం పడడంతో కల్వర్టు సామర్థ్యం పూర్తిగా దెబ్బతిందని వారు అంటున్నారు. శిథిల కల్వర్టు మీదుగా యథేచ్ఛగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో గ్రామస్తులు మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తీరప్రాంత గ్రామాలకు కీలకంగా కల్వర్టు

సఖినేటిపల్లి మండలం అంతర్వేది నుంచి మలికిపురం మండలం చింతలమోరి, కేశనపల్లి, మామిడికుదురు మండలం కరవాక వరకూ తీర ప్రాంతాలను కలుపుతూ ఉన్న ప్రధాన మార్గంలో మెండుపాలెం వద్ద శంకరగుప్తం డ్రెయిన్‌పై ఈ కల్వర్టు ఉంది. నిత్యం ఈ కల్వర్టు మీదుగానే వారంతా రాకపోకలు సాగిస్తుంటారు. ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలు కూడా ఇదే మార్గంలో నడుస్తుంటాయి. నియోజకవర్గంలో తీరం వెంబడి సుమారు 25 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల ప్రజల రాకపోకలకు ఈ కల్వర్టు ఎంతో కీలకంగా ఉంది.

ఓఎన్జీసీ వాహనాలకు ఇదే మార్గం

నియోజకవర్గంలో పొన్నమండ, గొల్లపాలెం, మోరి ప్రాంతాల్లో గ్యాస్ కలెక్షన్ స్టేషన్‌లను ఓఎన్జీసీ సంస్థ నెలకొల్పింది. అలాగే వీటి పరిధిలోని తీరం వెంబడి అంతర్వేది నుంచి కరవాక వరకూ ఉన్న ఓఎన్జీసీ బావుల వద్ద సంస్థ కార్యకలాపాలు సాగిస్తోంది. దీంతో సంస్థకు చెందిన భారీ వాహనాలు నిత్యం తీరం వెంబడి ఉన్న ఈ రహదారిలోని డ్రెయిన్‌పై శిథిల కల్వర్టు మీదుగానే వేర్వేరు చోట్లకు రాకపోకలు సాగిస్తున్నాయి.

కొత్త కల్వర్టు ఆవశ్యకత ఉంది

డ్రెయిన్‌పై కొత్త కల్వర్టు ఆవశ్యకత ఉంది. కల్వర్టు మీదుగా సాధారణ వాహనాలతో పాటు ఓఎన్జీసీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో కల్వర్టు సామర్థ్యం మరింత క్షీణించింది. కల్వర్టు పిల్లర్స్, గడ్డర్లు దెబ్బతిన్నాయి.

– వై.చిట్టిబాబు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడ, కేశవదాసుపాలెం

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

కేశవదాసుపాలెం శివారు మెండుపాలెం వద్ద శంకరగుప్తం డ్రెయిన్‌పై కొత్త కల్వర్టు నిర్మాణానికి రూ.కోటి 50 లక్షలకు అంచనాలు రూపొందించి పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటాం.

– సురేష్, ఆర్అండ్‌బీ జేఈ, రాజోలు

అంబరాన్నంటిన ప్రభల తీర్థం



అంబాజీపేట సెంటర్‌లో కొలువుదీరిన ప్రభలు

- అంబాజీపేటలో భక్తుల కోలాహలం
- దర్శించుకున్న ప్రజాప్రతినిధులు

అంబాజీపేట: సంక్రాంతి సందర్భంగా అంబాజీపేట సెంటర్‌లో ఏటా ముక్కనుమ రోజున నిర్వహించే ప్రభల తీర్థం (చక్రతీర్థం) మంగళవారం అత్యంత ఘనంగా జరిగింది. మాచవరంలోని రామ్‌ఘాట్‌లో వేంచేసిన పార్వతీ సమేత రాజేశ్వర స్వామి, కందుల మల్లేశ్వరస్వామి, యువగణపతి ఆలయాల వద్ద నుంచి ప్రభలను పురవీధుల్లో గౌడ యువసేన యువకులు ఊరేగింపుగా అంబాజీపేట సెంటర్‌కు తీసుకొచ్చారు. అక్కడ కొలువుదీరిన ప్రభలను భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. సెంటర్‌లో ఏర్పాటు చేసిన తీర్థానికి మండలంలోని పలువురు తరలివచ్చారు. సీఐ డి.ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్సై ఎ.చైతన్యకుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. తీర్థం ముగిసిన అనంతరం ప్రభలతో గ్రామోత్సం నిర్వహించారు. తీర్థంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, సినీ ఆర్కెస్ట్రా పలువుర్ని అలరించాయి. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, దొమ్మేటి దుర్గారావు తదితరులు ప్రభలను దర్శించుకున్నారు.



అంబాజీపేటలో ప్రభలను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఎరువుల సరఫరా

కొత్తపేట: రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) ద్వారా ప్రస్తుత రబీ (దాళ్వా) సీజన్‌కు అవసరమైన ఎరువులు సరఫరా చేస్తున్నట్టు వ్యవసాయ శాఖ కొత్తపేట సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వెంకటరామారావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్బీకే ద్వారా రైతులకు ఎరువుల సరఫరా విధానాన్ని పరిశీలించారు. ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన ఎరువులు, ప్రభుత్వం నిర్దేశించిన ధరకు పొందవలసినదిగా ఆయన రైతులకు సూచించారు. నాణ్యతలో రాజీ పడకుండా, నకిలీల బెడద లేకుండా రైతు రైతన్నకు తోడుగా భరోసా కేంద్రాలు పనిచేయాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు తగు చర్యలు తీసుకుంటున్నట్టు ఏడీఏ తెలిపారు. దానిలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లో 87 ఆర్‌బీకేలకు సుమారు 800 టన్నులు యూరియా, ఆత్రేయపురం మండలం పేరవరం, వద్దిపర్రు ఆర్‌బీకేలకు సుమారు 50 టన్నులు డీఏపీ దిగుమతి చేసి, రైతులకు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. ఆర్‌బీకేల్లో విక్రయించే ప్రతీది ప్రభుత్వ నాణ్యతా పరీక్ష కేంద్రాల్లో ముందుగా పరీక్షించి నాణ్యమైనవిగా నిర్ధారించిన తర్వాతే దిగుమతి చేస్తామన్నారు. ఇక్కడ ప్రైవేట్ దుకాణాల్లో మాదిరిగా లింక్ ప్రొడక్ట్స్ కొనాల్సిన అవసరం ఉండదన్నారు. కార్యక్రమంలో వీఏఏ కార్తిక్ తదితరులు ఉన్నారు.



కొత్తపేట ఆర్‌బీకేలో రైతులకు యూరియా సరఫరా చేస్తున్న ఏడీఏ వెంకటరామారావు

ప్రజలు మెచ్చే పాలన సీఎంతోనే సాధ్యం

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- బెల్లంపూడిలో గడప గడపకూ..

పి.గన్నవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలంతా మెచ్చే విధంగా సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. బెల్లంపూడిలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. సర్పంచ్ బండి మహాలక్ష్మి, నాయకులు బండి రాంబాబు, బండి రమేష్, గోవిందరావు, చింతా నాగేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిట్టిబాబు ఇంటింటికీ తిరిగి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చిట్టిబాబు వివరించారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత జగన్‌కే దక్కిందని అన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని చిట్టిబాబు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ విశ్వ హిందూ పరిషత్ సభ్యుడు పీకే రావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారు నాయుడు, సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్, వెంకట సాయిరామ్, సాధనాల రమేష్, బండి గోవిందరావు, నాగేశ్వరరావు, అర్జునరావు, ఆకుమర్తి నాగరాజు, శ్రీను, అడబాల సుబ్రహ్మణ్యం, ఎం.వెంకన్న, సంసాని రాంబాబు, దొమ్మేటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



బెల్లంపూడిలో మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

విద్యార్థుల అ'పూర్వ' కలయిక



అంబాజీపేట జెడ్పీ హైస్కూలులో ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు



లూటుకుర్రులో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కొత్తపేట: మండలంలోని వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6, 7 తరగతులు చదువుకున్న 1982–84 బ్యాచ్ విద్యార్థులు 39 సంవత్సరాల తరువాత అపూర్వ కలయిక పేరుతో మంగళవారం కలుసుకున్నారు. ఇందుకు మండలంలోని మందపల్లి సమీపాన కాశీరాజుగారి తోటను వేదిక చేసుకున్నారు. ఆనాడు ఆ పాఠశాలలో చదువుకుని ఉద్యోగులుగా, వ్యాపారులుగా స్థానిక, స్థానికేతర ప్రాంతాల్లో స్థిరపడిన వారిలో అనేకమంది సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామం వాడపాలెం, పరిసర గ్రామాలకు తరలిరాగా పూర్వ విద్యార్థులు అడ్డగళ్ల శ్రీనివాసరావు, పెదపూడి బాపిరాజు, ఆకి సుబ్రహ్మణ్యం, బళ్ల శ్రీనివాస్, నరహరశెట్టి రాంబాబు, అక్కల రాము తదితరుల ఆధ్వర్యంలో అపూర్వ సమ్మేళనం ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులు ఆ ప్రాంగణంలో అడుగు పెడుతూనే పరస్పరం పలకరింపులతో నేటి జీవన యానంలో పరిస్థితులను మరచిపోయి ఆనందానుభూతికి లోనయ్యారు. అంతా ఒక్కటై నాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. దాదాపు అందరూ కుటుంబ సమేతంగా హాజరు కాగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆట, పాటలతో ఉల్లాసంగా .. ఉత్సాహంగా గడిపారు. ఈ అపూర్వ కలయికకు సుమారు రెండు నెలలుగా కృషి చేసిన అడ్డగళ్ల శ్రీను దంపతులను ఘనంగా సత్కరించారు.

లూటుకుర్రులో..

మామిడికుదురు: లూటుకుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1994–95లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా జరిగింది. తమకు విద్య నేర్పిన గురువులు శరత్ బాబు, నాగరాజు, బంగార్రాజులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. వారికి పాదపూజ చేసి గురువుల రుణం తీర్చుకోలేనిదని కీర్తించారు. నాటి మధురస్మృతులను గుర్తుచేసుకుని పరవశించారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ పలకరింపులు నాటి చిలిపి గురుతులతో కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగింది. సహపంక్తి భోజనాలతో అపూర్వ సమ్మేళనాన్ని ఘనంగా ముగించారు.



కేశనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అంబాజీపేట: భోగి మంటల్లా కల్మషం లేని పలకరింపులు.. సంక్రాంతిలా సరదా ముచ్చట్లు.. ఘాటైన ఘుమఘుమలు పసందైన రుచులు.. ఇంద్రధనస్సులా క్షణక్షణ హరివిల్లు.. ఆప్యాయతల పొదరిల్లుపై రంగవల్లిలాంటి అనురాగాలు.. పూర్వ ఆత్మీయ సమ్మేళనంలో కనిపించిన దృశ్యాలు. అంబాజీపేట జెడ్పీ హైస్కూలులో 1994–95లో పదోతరగతి విద్యార్థులు మంగళవారం ఘనంగా నిర్వహించిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికతో కలుసుకున్నారు. 28 ఏళ్ల ఆనాటి అనుభూతులను ఒకరికొకరు గుర్తుచేసుకుని నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంతో పలకరించుకొంటూ క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

సఖినేటిపల్లి: స్థానిక లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 1990–91 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు పాఠశాలలో కలుసుకున్నారు. కరస్పాండెంట్ నల్లి ప్రేమానందం ముఖ్యఅతిథిగా పాఠశాలలో జరిగిన పై ఆత్మీయ కలయికలో నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. యోగక్షేమాలను ఒకరికొకరు అడిగి తెలుసుకున్నారు. పాఠాలు నేర్పిన ఉపాధ్యాయులకు వారు సత్కారం చేశారు. సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, పాఠశాల బోధన సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కేశనపల్లిలో..

మలికిపురం: మండలంలోని కేశనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం 2006–07 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు పాఠశాలలో ఒక వేదికపై కలుసుకున్నారు. నాడు పాఠాలను బోధించిన గురువులను సత్కరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను వారు ఒకరితో ఒకరు పంచుకున్నారు.



వాడపాలెం ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు



సఖినేటిపల్లి లూథరన్ ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక

ఘనంగా గ్రామ దేవతల తీర్థాలు

ఆలమూరు: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ దేవతల తీర్థ మహోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. పెదపళ్లలో వేంచేసిన పోలేరమ్మ, చొప్పెల్లలోని దానాలమ్మ, గుమ్మిలేరులో గ్రామ దేవతలు ఉరదాలమ్మ, దండు గంగమ్మ అమ్మవార్ల జాతర, తీర్థాలను ఆయా గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆయా గ్రామ ఆలయ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలను పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు తిలకించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత గరగ రూపంలో ఉన్న అమ్మవారికి నిర్వహించిన గ్రామోత్సవంలో గ్రామ మహిళలు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను సమర్పించారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్‌లంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉరదాలమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి నిర్వహించిన జాతర భక్తులను మంత్ర ముగ్ధులను చేసింది. గరగ నృత్యాలు, విచిత్ర వేషధారణలు, సన్నాయి, బ్యాండు మేళాలు, శక్తి వేషాలు, తీన్‌మార్ తదితర వినోద కార్యక్రమాలతో గ్రామంలో సందడి నెలకొంది.

ఆకట్టుకున్న ప్రభల ప్రదర్శన

మండలంలోని పెదపళ్లలో పోలేరమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రభల ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకర్షించింది. సన్నాయి, చర్మ వాయిద్యాల నడుమ శివ పార్వతులు కొలువైన ప్రభలకు గ్రామోత్సవం నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఒకే చోట ప్రభల ఉత్సవం ఒక్కచోటే ఉండటంతో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయం వెలుపల ప్రదర్శనగా ఉంచిన ప్రభలను దర్శించుకున్న భక్తులు అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులు గ్రామ దేవత పోలేరమ్మను దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



పెదపళ్లలో ప్రభలను దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా తాళ్లమ్మవారి జాతర

అయినవిల్లి: మండలంలోని పోతుకుర్రులో తాళ్లమ్మవారి జాతర, తీర్థమహోత్సవాలను మంగళవారం వైభవంగా జరిపారు. అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. అమ్మవారిని గ్రామస్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని కానుకలు, మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున తీర్థ మహోత్సవాలను జరిపారు.

న్యాయ విద్యార్థికి ఆర్థిక సాయం

ఆలమూరు: లా ప్రవేశ పరీక్షలో అత్యుత్తమైన 1700 ర్యాంకు సాధించి చదువుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విద్యార్థి యాళ్ల విష్ణువర్ధన్‌కు గ్రామానికి చెందిన మురళీకృష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు ఆర్థిక సాయం ప్రకటించారు. బీఎల్ చదువు పూర్తి చేసి లా పట్టా చేతికొచ్చే వరకూ ఆర్థికంగా ఆదుకుంటానని భరోసా కల్పించారు. తొలివిడత సాయంగా ప్రస్తుతం ఫీజులు, ఖర్చుల నిమిత్తం రూ.15 వేలను ఆయన స్థానిక పంచాయతీ కార్యాలయంలో విష్ణువర్ధన్‌కు అందజేశారు. నాతి కుమార్‌రాజా, కొపనాతి శ్రీనివాసు, చిన్నం హరినాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి ఆర్థికసాయం అందజేస్తున్న దాత పాపారావు

విలసలో క్రికెట్ పోటీలు

అయినవిల్లి: విలసలో సంక్రాంతి సంబరాల్లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 16 జట్లు హాజరయ్యాయి. గుత్తెనదీవి జట్టు, ముమ్మిడివరం జట్టు ఫైనల్‌కు చేరుకున్నాయి. ముమ్మిడివరం జట్టు విజేతగా నిలిచింది. నిర్వాహకుల చేతుల మీదుగా ముమ్మిడివరం జట్టుకు బహుమతి ప్రదానం చేశారు.

వాడపల్లిలో బొమ్మల కొలువు

ఆత్రేయపురం: మండలంలోని వాడపల్లి సత్యసాయి మందిరంలో మంగళవారం బొమ్మలకొలువు ఏర్పాటు చేశారు. ప్రాచీన సంప్రదాయాలను తెలిపేందుకు బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. సుమారు 150 మంది ఈ బొమ్మల కొలువులో పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక సాయం

మలికిపురం: మండలంలోని మేడిచర్లపాలెంలో మంగళవారం స్థానిక ఎన్నారై యువకులు కలసి 52 మంది పేదలకు రూ.500 చొప్పున నగదు పంపిణీ చేశారు. దుబాయ్‌లో ఉంటున్న యువకులు ముత్యాల శ్రీను, మేడిచర్ల నాగయ్య, అల్లు నాగేశ్వరరావు, మేడిచర్ల గోపాలకృష్ణ, గంటా మాణిక్యాలరావు, మరికొంత మంది పై మొత్తాన్ని సమకూర్చారు. కాగా సామాజిక సేవకు చొరవ చూపిన యువకులను గ్రామస్తులు అభినందించారు.